పంటకోత ప్రయోగాలపై శిక్షణ

ప్రజాశక్తి - హుకుంపేట: మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో పంటకోత ప్రయోగాలపై గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులు, ఏఈఓ, ఎంపీ ఈఓలకు శిక్షణ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ శిక్షణకు సహాయ గణాంకాధికారి అభిలాష్ శిక్షకుడిగా వ్యవహరించారు. మండల వ్యవసాయ అధికారి కె. సుధాకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో, ప్రయోగ క్షేత్ర ఎంపిక, ప్రయోగం నిర్వహించే విధానం వంటి అంశాలపై వివరంగా సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా అభిలాష్ మాట్లాడుతూ, పంటకోత ప్రయోగాల ద్వారా పంటల దిగుబడిని లెక్కించడం, తద్వారా పంటకు నష్టం తలెత్తినప్పుడు ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన పథకం కింద ఇన్సూరెన్స్ వర్తింపచేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

శిక్షణ ఇస్తున్న అభిలాష్

కార్మికులపై కూటమి కక్ష

- చట్టాల అమలులో నిర్లక్ష్యం- లేబర్ కోడ్‌లపై పోరాడాలి
- కనీస వేతనాలు చెల్లించాలి
- హైడ్రో పేరుతో భూములు దారాదత్తం చేస్తే ఊరుకోం
- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు
- ఉత్తేజంగా సంఘం జిల్లా మహాసభ

భారీగా హాజరైన కార్మికులు, మహిళలు

మాట్లాడుతున్న సిహెచ్ నర్సింగరావు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: కార్మికులపై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు అవలంబిస్తున్నదని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు విమర్శించారు. అల్లూరి జిల్లా అరకులోయ మండల కేంద్రంలోని సిఐటియు జిల్లా 2వ జిల్లా మహాసభ సోమవారం ఘనంగా ప్రారంభమైంది. అరకులోయ పోలీస్ స్టేషన్ సమీప పెట్రోల్ బంక్ నుండి సభా వేదిక వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఎర్రజెండాలు చేతబట్టి డప్పు కళాకారులు, దింసా నృత్యాలతో ఉత్సాహ భరితంగా ర్యాలీ ప్రదర్శన చేపట్టారు. ఈ మహా సభలను సిఐటియు సీనియర్ నాయకులు పాడి కొండలరావు జెండా ఆవిష్కరణ చేసి ప్రారంభించారు. అనంతరం అమరవీరులు కె సర్వన్న, నవీన, అప్పలరాజు చిత్రపటాలను పూలమాలలు వేసి నివాళులర్పించారు. బహిరంగ సభకు జోనంగి చిన్నయ్య పడాల్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు మాట్లాడుతూ, గిరిజన ప్రాంతంలో తక్కువ జీతం ఇచ్చి కార్మికులతో ఎక్కువ పని చేయించుకుంటున్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 8 గంటల పని దినాన్ని 12 గంటలు పెంచుతూ అసెంబ్లీ సమావేశంలో చట్టం తీసుకువచ్చారని, కార్మికులపై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు అవలంబిస్తుందన్నారు. కార్మికులను కనీస వేతనం రూ 26,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మిక చట్టాలు యాజమాన్యాలు అమలు చేయడం లేదని, భద్రత లేకుండా బతుకుతున్నారని తెలిపారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికవర్గం త్యాగాలతో పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కేంద్ర బిజెపి ప్రభుత్వం 4 లేబర్ కోడ్లుగా మార్చివేసిందని, లేబర్ కోడ్లుకు వ్యతిరేకంగా పోరాడాలని కార్మిక వర్గమంతా ఏకమై పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.విశాఖ స్టీల్ ప్లాంట్ ను ప్రైవేటుకరణ చేయాలని కేంద్రం బిజెపి ప్రభుత్వం తీవ్ర ప్రయత్నం చేస్తుందని విమర్శించారు.పాడేరు ఐటిడిఏ ఏర్పాటు చేసినప్పుడు నుండి కార్మికులు పనిచేస్తున్నారని, ఇంకా కాంట్రాక్ట్,అవుట్ సోర్సింగ్ పద్ధతిలోనే తక్కువ జీతానికి పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న పరిస్థితి ఉందన్నారు.గిరిజన ప్రాంతంలో ఒక్క సెంటు భూమి గిరిజనేతరులు తీసుకోవడానికి హక్కు లేదని,ఆ చట్టం గిరిజనులకు గుండెకాయ లాగా రక్షణ కల్పిస్తుందన్నారు.గతంలో బాక్సైడ్ తవ్వాలని ప్రభుత్వం ప్రయత్నం చేసిందని ,సిపిఎం,సిఐటియు ఆధ్వర్యంలో గిరిజనులతో కలిసి ముక్తకంఠంతో పోరాటం చేసిన ఘనత గిరిజన ప్రజానీకానికి ఉందన్నారు.హైడ్రో పవర్ ప్రాజెక్ట్ పేరుతో నవయుగ, అదాని, శిరిడి సాయి, బడా కంపెనీలకు గిరిజనులు భూములు ధారాదత్తం చేయడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకుంటున్నాయని దుయ్యబట్టారు. హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణం చేపడితే సుమారు 20వేల ఎకరాలు, 250 గ్రామాలు, 50 వేల మంది జనాభా జలసమాధి అయ్యే పరిస్థితి ఉందన్నారు. హైడ్రో పవర్ ప్రాజెక్టు కోసం గిరిజనుల భూములు ప్రైవేటు వ్యక్తులకు దారాదత్తం చేయడం ప్రభుత్వానికి హక్కు ఎవరిచ్చారని ప్రశ్నించారు. కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత కార్మికులకు వ్యతిరేకంగా పనిచేస్తున్నాయని విమర్శించారు. అంగన్వాడి ఆశ వర్కర్లు చాలిచాలని జీతాలతోనే పనిచేస్తున్నారని, కనీస వేతనం 26,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. వివోఏలను తొలగించాలని కూటమి ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నం చేస్తుందని, తొలగిస్తే ఈ ప్రభుత్వమే పతనమవుతుందని హెచ్చరించారు.

థింసా నృత్యం చేస్తున్న మహిళలు

సిఐటియూ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆర్ శంకర్రావు మాట్లాడుతూ, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టాలని కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నం చేస్తుందన్నారు. రాష్ట్రం పది మెడికల్ కాలేజీలను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టడానికి పూనుకుందన్నారు.మెడికల్ కాలేజీలు ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెడితే గిరిజన ప్రాంతంలో చదివే పిల్లలకు సీట్లు ఎలా వస్తాయని ప్రశ్నించారు.జిల్లాలో వివిధ శాఖల్లో చాలీచాలని తక్కువ జీతంతో పని చేస్తున్న కార్మికులు ఉన్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ప్రచారంలో భవన నిర్మాణ సంక్షేమ బోర్డు పునరుద్ధరణ చేసి కార్మికులను ఆదుకుంటామని చెప్పి నేటికి ఆ హామిలు అమలు చేయలేదన్నారు.

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు, అనంతగిరి జడ్పిటిసి గంగరాజు మాట్లాడుతూ, పోరాడి సాధించుకున్న 8 గంటల పని దినాన్ని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 12 గంటలు పని దినాలను పెంచడం అంటే ప్రభుత్వం కార్మికుల కార్మికుల మీద ఎంత వివక్షత చూపుతున్నారో స్పష్టంగా అర్థం అవుతుందని పేర్కొన్నారు.కార్మికులను సమాన పనికి సమాన వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్బి పోతురాజు, ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి బాలదేవ్, సిఐటియు మండల కన్వీనర్ జె.భగత్రం, ఎల్.సుందర్‌రావు, జి.సత్యనారాయణ, నాగరాజు, సూరిబాబు, అంగన్వాడి నాయకులు కె భాగ్య, నాగమ్మ, వివోఎల సంఘం నాయకులు రాజ్ కుమార్, డి రాజు, నాగమ్మ, లక్ష్మీ, సింహాద్రి పాల్గొన్నారు.

నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం ఎన్నిక

ప్రజాశక్తి-అరకులోయ: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం, రాష్ట్ర అధ్యక్షులు ఎన్.చంద్ర శేఖర్ ఆదేశాల మేరకు అరుకు తాలూకా యూనిట్, పాడేరు అల్లూరి సీతారామ రాజు జిల్లా కార్యవర్గ ఎన్నికలు అరకులోయ లో జరిగాయి. అరకు వేలి, గిరిజన భవనంలో జరిగిన ఈ కార్యవర్గ ఎన్నికల్లో ఏడు గురు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అరకులోయ మండల అధ్యక్షులుగా కె.బాబురావు ఏకగ్రీవంగా ఎన్నికవ్వగా కార్యదర్శిగా టి.కార్తీక్, ఉపాధ్యక్షులుగా బి. గంగమ్మ, కె.సోన్ను,సంయుక్త కార్య దర్శులుగా పి. రంజిత్, కే.సింహద్రి, కోశాధికారిగా కె.పండు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారి జి.శ్రీనివాస్‌రావు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఎన్నికల అధికారి పాడేరు జిల్లా కార్యదర్శి వెంకట రమణ, అధ్యక్షులు అప్పారావు, అరకు మాజీ అధ్యక్షులు జోగులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎన్నికైన నూతన సభ్యులు

వాటర్ ట్యాంకు మరమ్మతు చేపట్టాలి

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలంలోని బూసిపుట్టులో ఆర్ఓ ప్లాంట్ మరమ్మతులు చేపట్టి తాగునీరు సౌకర్యం అందించాలని ఆ గ్రామస్తులు కంచం మిన్నారావు (వార్డ్ మెంబర్) వంతల బొంజి బాబు (వార్డ్ మెంబర్), కిలో జలంధర్ (వైసిపి పంచాయతీ కార్యదర్శి),వంతల గణపతి,కిలో ధనుర్జై, రావెల్లి రామదాసు, లతోపాటు గ్రామంలోని మహిళలు తెలిపారు. వాటర్ ట్యాంక్ వద్ద నిరసన చేపట్టారు.అనంతరం వార్డు మెంబర్ కంచం మీనారావు, సాధురంలు మాట్లాడుతూ, 2021- 22వ సంవత్సరంలో సుమారు 10 లక్షలతో ఆరో ప్లాంట్‌ను పనులు చేపట్టి నిలుపుదల చేశారని తెలిపారు. దీంతో శిథిలావస్థకు చేరిందని తెలిపారు. అధికారులు తక్షణమే స్పందించి మరమ్మత్తులు చేపట్టి తాగునీటి సౌకర్యాన్ని అందించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో భుసిపుట్టు గ్రామం మహిళలతో ఖాళీ బిందెలు ప్రదర్శిస్తూ మండల అభివృద్ధి శాఖ అధికారి కార్యాలయాన్ని ముట్టడించడానికి వెనకాడబోమని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ట్యాంకును పరిశీలిస్తున్న మహిళలు

తాగునీటిని క్లోరినేషన్ చేయాలి

- కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: బహిరంగ మల విసర్జన రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని, గ్రామాలలో క్రింది స్థాయి సిబ్బంది ప్రతి గృహమును సందర్శించి మరుగు దొడ్ల (ఐ హెచ్ హెచ్ ఎల్) సౌకర్యం ఉన్నాయెూ లేదో సమాచారాన్ని సేకరించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన ఆయన మాట్లాడుతూ ఆర్ డబ్ల్యూ ఎస్ ఇంజనీరింగ్ అధికారులు , మండల అభివృద్ధి అధికారులు, ఈవోపిఆర్‌డీలు క్షేత్ర స్థాయిలో పర్యటించి నిరంతరం ఈ కార్యక్రమమును పర్యవేక్షణ చేసి జిల్లాలో కార్యక్రమాన్ని విజయవంతం చేయుటకు ప్రతిపాదనలు తయారు చేసి జిల్లా కలెక్టర్ కార్యాలయానికి అందజేయాలన్నారు. స్వచ్ఛ్ భారత్ మిషన్ ద్వారా మండల రిసోర్స్ కోఆర్డినేటర్లలకు శిక్షణ ఇవ్వాలన్నారు. జిల్లాను బహిరంగ మల విసర్జన రహిత జిల్లాగా తయారు చెయ్యాలని పిలుపునిచ్చారు. సొంత భవనములు కలిగి ఉన్న ప్రభుత్వ కార్యాలయాల్లో, ప్రముఖ పర్యాటక దర్శనీయ ప్రదేశాలలో, ప్రజలు అధికముగా తిరుగాడే బహిరంగ స్థలాలలో కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ లను నిర్మించడానికి వాటిలో మౌళిక వసతులను కల్పించడానికి ప్రభుత్వ విభాగాలతో సమన్వయం చేసుకోవాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలలో మరుగుదొడ్లు , నీటి వసతి పనులను పూర్తి చేయడానికి పెండింగ్ లో ఉన్న బిల్లులను ఉన్నతాధికారులతో మాట్లాడి చెల్లింపులను చేపట్టాలన్నారు. ప్రతి గ్రామములో తాగునీటిని పరీక్షించి విధిగా క్లోరినేషన్ చేయాలని, ఫ్లోరిడ్ ,నైట్రేట్ , బాక్టీరియా వంటి అవశేషాలు తాగు నీటిలో కనబడకుండా నిరంతరం వాటర్ టెస్టింగ్ శాంపిల్ లను సేకరించి పరిక్షీంచాలన్నారు. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ బివివి నాగేశ్వరరావు, డిఆర్డిఏ పిడి మురళి, జిల్లా వ్యవసాయ అధికారి నంద, ఏపి ఈపిడిసియల్ ఎస్ఈ ప్రసాద్, పంచాయత్ రాజ్ ఈఈ కొండయ్య పడాల్, మండల అభివృద్ధి అధికారులు పాల్గొన్నారు .

మాట్లాడుతున్న కలెక్టర్

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి హేయం

ప్రజాశక్తి-పాడేరు: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై మతోన్మాదుల దాడిని ఖండించాలని, దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని సి.పి.ఎం జిల్లా కార్యదర్శి పి. అప్పల నరస కేంద్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. సనాతన ధర్మానికి అవమానం జరిగిందన్న పేరుతో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై మతోన్మాద అడ్వకేట్ ఒకరు కోర్టులో అందరూ చూస్తుండగానే చెప్పు విసరటం దేశంలో నెలకొన్న దుస్థితికి అద్దం పడుతున్నదన్నారు. మోడీ పాలనలో మతోన్మాదులు అన్ని వ్యవస్థలను ధ్వంసం చేస్తూ ఉన్నారని, ఇప్పుడు బహిరంగంగా సనాతనధర్మ పరిరక్షణ పేరుతో సుప్రీంకోర్టు న్యాయమూర్తి పైనే చెప్పు విసరడం రాజ్యాంగానికి తీవ్ర అవమానకరమన్నారు.ఇదే సనాతన ధర్మమని ప్రధానమంత్రి భావిస్తున్నారా? అంటూ ప్రశ్నించారు.సనాతన ధర్మం పేరుతో ప్రచారం చేస్తున్న పవన్ కళ్యాణ్ దీన్ని బలపరుస్తారా? వ్యతిరేకిస్తారో స్పష్టం చేయాలని అన్నారు. దోషులపై కఠిన చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు.

దుకాణాల వద్ద ధరలు పట్టికలు పెట్టాలి

ప్రజాశక్తి-పెదబయలు : ప్రభుత్వం జిఎస్‌టి తగ్గించిన నేపథ్యంలో పాతధరలు, కొత్త ధరలతో ధరల పట్టికను దుకాణాల వద్ద పెట్టాలని వినియోగదారుల సమాఖ్య అధ్యక్షులు కూడా కృష్ణబాబు, కౌన్సిల్ మెంబర్ పాంగి శివప్రసాద్ డిమాండ్ చేశారు. నూతన జీఎస్టీ ధరలకు అనుగుణంగా వర్తకులు వస్తువుల విక్రయాలు జరపాలని కోరారు. మండల కేంద్రంలో జరిగిన తగ్గిన జిఎస్‌టిపై అవగాహన కార్యక్రమంలో సమాఖ్య అధ్యక్షులు బూడిద చిట్టిబాబు, రిటైర్డ్ జీఎస్టీ అధికారి పాంగి సోములు, విజిలెన్స్, హత్యాచారాల నిరోధక చట్టం జిల్లా మెంబర్ చెండా లోహితాసుడు మాట్లాడారు. కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గాదె అప్పారావు, వర్తక సంఘం ప్రెసిడెంట్ లొట్టి త్రినాథరావు, జిసిసి మేనేజర్, సిబ్బంది పాల్గొన్నారు.

మెడికల్ హెల్త్ ఎంప్లాయిస్ సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-రంపచోడవరం : మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ సమస్యలు పరిష్కరించాలని ఆ సంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జివి.రమణ అన్నారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో యూనియన్ స్థాయి సమావేశం సోమవారం నిర్వహించారు ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 28 వేల కోట్ల బకాయిలు ఉన్నాయని ఐదు డిఎ బకాయిలు ఉన్నాయని పిఆర్సి ఇప్పటికే సంవత్సరకాలం ఆలస్యం అయిందని కాబట్టి ప్రభుత్వం వెంటనే ఈ సమస్యను పరిష్కరించా లన్నారు. పిఆర్సి కమిషన్ నియమించి ఫిట్‌మెంట్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనంతరం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగ కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తు న్నాయని దీనిలో భాగంగా పని గంటలు పెంపుదల లేబర్‌కోర్డు ఉపసంహరణ చేయాలని డిమాండ్ చేశారు. సంఘ గౌరవ అధ్యక్షులు కేవీఎన్ రాజు మాట్లాడుతూ ఏజెన్సీలో వైద్యఆరోగ్యశాఖ ఉద్యోగుల సమస్యలు అసాధారణంగా ఉన్నాయని ప్రతి పిహెచ్‌సిలోను ఉద్యోగులకు రావాల్సిన పిరియాడికల్ రెగ్యులర్ ఇంక్రిమెంట్లు వ్యాక్సిన్ ట్రాన్స్‌పోర్టు అలవెన్సులు అడిషనల్ హెచ్ఆర్ఏలు రేషన్ అలవెన్స్‌లు ఇలా పలు రకాల ఆర్థిక బకాయిలు పెరిగిపో యాయని స్థానిక డిడివోలు ట్రెజరీ స్థాయిలో పరిష్కరించే అవకాశాలు ఉన్నా సమస్యలు పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘ జిల్లా అధ్యక్షులు రత్నరాజు మాట్లాడుతూ 1207 జిఒ ద్వారా నియమించబడి కాంట్రాక్ట్ హెల్త్ అసిస్టెంట్లను రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1000 మంది ఉద్యోగులను తొలగించడం దారుణమని వెంటనే వారిని రెగ్యులర్ ప్రాతిపదదికన తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ కాంట్రాక్ట్ హెల్త్ అసిస్టెంట్లను, ఎఎన్ఎంలను స్టాఫ్ నర్సులను రెగ్యులర్ చేయించుకున్న ఘనత యుఎంఅండ్‌హెచ్ యుకు చెందుతుందని తెలిపారు. మహిళా నాయకురాలు ప్రభారాణి మాట్లాడుతూ సచివాలయ ఎఎన్ఎంలను రెగ్యులర్ ఎఎన్ఎంలుగా మార్చుకున్నామని మిగిలిన వారిని ఇతర మహిళ ఉద్యోగ సమస్యలకు పరిష్కారం యుఎంఅండ్ ద్వారా మాత్రమే సాధ్యం అని తెలిపారు. యోహాన్ రాఘవ, పెద్దఎత్తున ఉద్యోగులు హాజరయ్యారు.

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్

సద్దుమణిగిన పోడు వివాదం

ప్రజాశక్తి-సీలేరు: జికె వీధి మండలం ధారకొండ పంచాయతీ చోడిరాయి, గుమ్మిరేవుల పంచాయితీ తోకరాయి గ్రామస్తుల మధ్య నెలకొన్న పోడు వివాదం ఎట్టకేలకు సద్దుమణిగింది. ఇరు పంచాయతీల ప్రజాప్రతినిధులు రెండు గ్రామాల ప్రజలకు సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. తోకరాయి గ్రామస్తులు చోడిరాయి గ్రామ పరిధిలో పోడు వ్యవసాయం చేయడం పట్ల నెలకొన్న వివాదంపై క్షుణ్ణంగా చర్చించారు. సీలేరు అటవీ రేంజి పరిధి ఫారెస్ట్‌లో తోకరాయి గ్రామానికి ఆనుకొని ఉన్న ఆర్వోఎఫ్ ఆర్ పట్టాలు పొందిన చోడిరాయి గ్రామ రైతులు భూములు సాగు చేసుకోవచ్చని పెద్దల సమక్షంలో ఇరు గ్రామాలు ఒప్పందం కుదుర్చుకుని అంగీకార పత్రం రాసుకున్నారు. మిగిలిన అటవీ పోడు భూముల్లో సాగులో ఉన్నవారు లిఖితపూర్వకంగా ఫారెస్ట్ అనుమతులు వచ్చేవరకూ ఎవరు సాగు చేయరాదని తీర్మానించి ఒప్పందం కుదుర్చుకున్నారు. తోకరాయి గ్రామస్తులు చోడిరాయి గ్రామ పరిధిలో ఉన్న చెట్లుని నరకరాదని ప్రజాప్రతినిధులు ఆంక్షలు విధించారు. ఇరు గ్రామాలు సోదరభావంతో మెలిగి పరస్పరం సహకరించుకోవాలని సూచించారు. సీలేరు ఎస్సై రవీంద్ర ముందస్తుగా ఇరు గ్రామాలకు సమావేశపరిచి కౌన్సిలింగ్ నిర్వహించి వారికి నచ్చచెప్పారు. దీంతో ఇరు గ్రామాల మధ్య శాంతియుత వాతావరణం నెలకొని ఒక అంగీకారానికి వచ్చారు. ఈ క్రమంలోనే ఎటువంటి తగాదాలు పడమని ప్రజాప్రతినిధుల సమక్షంలో అంగీకార పత్రం రాసుకుని ఎస్సై రవీంద్రకు అందజేశారు. పోడు వివాదానికి ముగింపు పలకడానికి కృషి చేసిన ఎస్ఐ రవీంద్రకు ఇరు గ్రామాల గిరిజనులు ప్రజాప్రతినిధులు ప్రశంసించారు. కార్యక్రమంలో ధారకొండ సర్పంచ్ నడిగట్ల రాజు గుమ్మరేవుల సర్పంచ్ మురళి కమలమ్మ, మాజీ సర్పంచ్ బాబురావు కాంగ్రెస్ నాయకులు రాంబాబు రామ్మూర్తి పాల్గొన్నారు.

ఎస్సై రవీంద్రకు అంగీకార పత్రం అందజేస్తున్న ఇరు గ్రామాల ప్రజాప్రతినిధులు

ముంపునకు గురైన పంటలు పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

పంటలకు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోండి

- సిపిఎం

ప్రజాశక్తి-విఆర్‌పురం: ఇటీవల వరుస వరదల వల్ల పంటలు మునిగిపోయి నష్టపోయిన రైతాంగానికి నష్టపరిహారం ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం డిమాండ్ చేసింది. సిపిఎం జిల్లా నాయకులు సోయం చిన్నబాబు, పులి సంతోష్‌కుమార్, ఎంపిపి కారం లక్ష్మి ఆధ్వర్యంలో సిపిఎం బృందం మండల పరిధిలోని తోటపల్లి గ్రామాన్ని సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక రైతులు ఇటీవల వచ్చిన వరదల వల్ల పంటలన్నీ మునిగి తీవ్రనష్టం వాటిల్లిందని ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరగా స్పందించిన పార్టీ బందం పంట నష్టం జరిగిన పొలాలను పరిశీలించారు. రెండు నెలలుగా విడతలవారీగా గోదావరి వరదలు మండలాన్ని అతలాకుతలం చేశాయని ఇప్పటికే వ్యవసాయ సీజన్ దాటిపోయే పరిస్థితి వచ్చిందని వేసిన పంటలను గోదావరి వరద రూపంలో నష్టపరిచిందన్నారు. తక్షణమే ప్రభుత్వ అధికారులు స్పందించి మండలంలో జరిగిన పంట నష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి రైతులందరికీ నష్టపరిహారం ఇప్పించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల నాయకులు పంకు సత్తిబాబు, పోడియం శ్రీరామమూర్తి, కారం సుందరయ్య, కమ్మ చిచ్చు సత్యనారాయణ, కుంజా కన్నయ్య, కురసం శ్రీను గ్రామస్తులు పాల్గొన్నారు.

అర్జీలను స్వీకరిస్తున్న పిఒ స్మరణ్‌రాజ్

సమస్యల సత్వర పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-రంపచోడవరం : రంపచోడవరం ఐటిడిఎ పిఒ స్మరణ్ రాజ్ సోమవారం స్థానిక ఐటిడిఎ సమావేశ భవనంలో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులతో ప్రజా సమస్యల పరిష్కారవేదిక(గ్రీవెన్స్) కార్యక్రమం నిర్వహించారు. ఎపిఒ జనరల్ డిఎన్వి రమణ, గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య, సబ్‌కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి యం.సావిత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ ఈ వారం సుమారు 63 అర్జీలు వచ్చాయని పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

ఉపాధి శ్రామికులకు ఇకెవైసి పూర్తి చేయాలి

ప్రజాశక్తి -రంపచోడవరం : ఉపాధిహామీ పథకంలో బినామీ మస్టర్లు నిరోధించడానికి ప్రభుత్వం ఇకెవైసి విధానాన్ని తీసుకొచ్చిందని 'నో యువర్ కస్టమర్' విధానంలో రంపచోడవరం క్లస్టరులో ఉన్న 4 మండలాలలో ఉపాధిహామీ శ్రామికులను ఇకెవైసితో అనుసంధానం చేస్తున్నామని, దీనివలన మస్టర్ల మాయాజాలం ఉండదని, పని డిమాండ్ కూడా ఆన్‌లైన్‌లో ఇవ్వడం జరుగుతుందని డ్వామా ఎపిడి తూతిక శ్రీనివాసవిశ్వనాథ్ అన్నారు. సోమవారం రంపచోడవరం పంచాయతీ సిరిగిందలపాడు ఆవాసాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి ఉపాధి శ్రామికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంపచోడవరం క్లస్టరులో 15,800 మంది శ్రామికులు ఉన్నారని గత 4 రోజుల నుండి 7,800 మందిని ఇకెవైసి పరిధిలోకి తీసుకొచ్చామన్నారు. సోమవారం సాయంత్రం నాటికీ 100% లక్ష్యాన్ని పూర్తి చెయ్యాలని ఉపాధిహామీ పథకం సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎపిఒ శ్రీనివాస్, జెఇ బి.ఎడ్విన్, సాంకేతిక సహాయకులు విధుషిమణి, టి.ఎ వి. వీరన్న తదితరులు పాల్గొన్నారు.

ధారకొండ వద్ద కోతకు గురైన రోడ్డు

కోతకు గురైన రహదారి

ప్రజాశక్తి -సీలేరు: జికె వీధి మండలం ధారకొండ రామాలయం సమీపంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ప్రధాన రహదారి కోతకు గురైంది. రహదారికి ఇరువైపులా డ్రైనేజీ లేకపోవడంతో భారీ వర్షాలకు బిటి రోడ్డుపై వర్షం నీరు ఏరులై పారడంతో అంచులు కోతకు గురై కొట్టుకుపోయాయి. దీంతో రహదారి ప్రమాద భరితంగా మారింది. ఆటోలు, ద్విచక్రవాహనాలపై వచ్చేవారు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఆర్‌అండ్‌బి అధికారులు స్పందించి తక్షణమే మరమ్మతులు నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు. రహదారికి ఇరువైపులా డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

మాట్లాడుతున్న స్పెషల్ ఆఫీసర్ ఎపిఒ ప్రకాష్

పలు ఉపాధి పనులకు గ్రామసభ తీర్మానం

ప్రజాశక్తి - గంగవరం: పంచాయతీ కార్యాలయం నందు వచ్చే ఆర్థిక సంవత్సరానికి 2026-27కి సంబంధించి పనులు గుర్తింపునకు ఉపాధి పథకానికి సంబంధించిన గ్రామసభ సర్పంచ్ కలుముల అక్కమ్మ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి స్పెషల్ ఆఫీసర్ ఎపిఒ ప్రకాష్ మాట్లాడుతూ జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ఉపాధి పనులకు హాజరు కావాలని లేకపోతే పనిదినాలు తగ్గడం వల్ల గ్రామానికి వచ్చే మెటీరియల్ కాంపోనెంట్ తగ్గుతుందని అదేవిధంగా పనులకి సంబంధించి ఏయే పనులు ఈ పథకంలో కవర్ అవుతున్నాయో తెలిపారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని ఉపయోగించుకుని పనిదినాలు పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి గంగాదేవి, వైస్‌ప్రెసిడెంట్ పరదా వెంకటేశ్వర్లు (గిరి), కూటమి నాయకులు మాజీ ఎంపిటిసి కోసు బుల్లియమ్మ , సత్యవేణి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, సచివాలయం సిబ్బంది, ఎన్‌ఆర్‌జిఎస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘాట్ రోడ్డులో విరిగిపడిన కొండచరియలు

రోడ్డుపై కుప్పలుగా మట్టి, రాళ్లు : వాహనదారుల అవస్థలు

విరిగిపడిన కొండచరియలు

ప్రజాశక్తి-చింతపల్లి : ఆదివారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి లమ్మసింగి ఘాట్ రోడ్డులో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. కొండలపై నుండి మట్టి, రాళ్లు జారిపడి రోడ్డు మీద పేరుకుపోవడంతో వాహనాలు రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. ముఖ్యంగా లంబసింగి వ్యూ పాయింట్ మలుపు నుంచి తురబడ గ్రామం వరకు రోడ్డుపై మట్టి గుట్టలు, రాళ్ళు చిందరవందరగా ఉండడంతో వాహనదారులు తంటాలు పడుతున్నారు. వర్షం కారణంగా రోడ్డు పక్కనున్న రక్షణ గోడలు పాక్షికంగా కూలిపోవడంతో మరింత ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి. మరోసారి భారీ వర్షం కురిస్తే పెద్ద ఎత్తున మట్టి జారిపడి ప్రమాదం సంభవించే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పలుచోట్ల రోడ్డుపై జారుడు మట్టి కారణంగా వాహనదారులు ఎదురెదురుగా వస్తున్న వాహనాలను తప్పించుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు వెంటనే స్పందించి రోడ్డుపై పేరుకున్న మట్టి, రాళ్లను తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. రాత్రి వేళల్లో లంబసింగి ఘాట్ రోడ్డులో ప్రయాణించవద్దని పోలీసులు, స్థానికులు వాహనదారులను హెచ్చరిస్తున్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

విద్యార్థులతో మాట్లాడుతున్న పిఒ శ్రీపూజ

ప్రజాశక్తి-హుకుంపేట: ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా చదువుకోవాలని పిఒ శ్రీపూజ హితవు పలికారు. విద్యార్థులు గణితం పై మంచి పట్టు సాధించాలన్నారు. గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులతో కలిసి బుధవారం హుకుంపేట మండలం అల్లంపుట్టు గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి వెనుకబడి ఉండటాన్ని గమనించి అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఆశ్రమ పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేదిశగా చర్యలు చేపట్టాలన్నారు.

మాదక ద్రవ్యాల రవాణా నేరం

ర్యాలీ చేపడతున్న పోలీసులు

ప్రజాశక్తి-చింతపల్లి : మత్తు పదార్థాల అక్రమ రవాణా నేరమని చింతపల్లి ఈగల్ టీమ్ పోలీసులు తెలిపారు. మండలంలోని అన్నవరం వారపు సంతలో సోమవారం మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా భారీ ర్యాలీ నిర్వహించారు. ఇందులో అన్నవరం ఆటో డ్రైవర్ల యూనియన్ సభ్యులు, స్థానిక ప్రజలు, యువత భారీగా పాల్గొన్నారు. కరపత్రాలు పంపిణీ చేసి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ మత్తు పదార్థాలు మానవ సమాజాన్ని నాశనం చేస్తున్నాయని, యువత భవిష్యత్తు దెబ్బతింటోందని పేర్కొన్నారు. పౌరుల సహకారంతోనే ఈ అక్రమ రవాణాను అరికట్టగలమన్నారు.

పిఎం జన్‌మన్ ఇళ్ల బిల్లులు చెల్లించాలి

• ఎపి ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలదేవ్

పటో: మాట్లాడుతున్న బాలదేవ్

ప్రజాశక్తి-పెదబయలు : పిఎం జన్మన్ బిల్లులు వెంటనే లబ్ధిదారులకు చెల్లించాలని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బలదేవ్ డిమాండ్ చేశారు. సంఘం మండల విస్తృత సమావేశం పప్పుల బుజ్జిబాబు అధ్యక్షతన సోమవారం జరిగింది. ఇందులో పాల్గొన్న బాలదేవ్ మాట్లాడుతూ మండలంలోని 22 పంచాయతీల పరిధిలో 1372 మంది పిఎం జన్మన్ పథకం లబ్ధిదారులకు కోట్లాది రూపాయలు బకాయిలు చెల్లించవలసి ఉందని పేర్కొన్నారు. ఇల్లు నిర్మాణం చేసుకున్నా ముడుపులు చెల్లిస్తే గాని బిల్లులు పెట్టటం లేదని, అవినీతికి పాల్పడుతున్న హౌసింగ్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం లక్ష రూపాయలు పెంచుతున్నట్టు ప్రకటించినా ఆ మొత్తం లబ్ధిదారుల ఖాతాలో నేటికీ జమచేయలేదని, వెంటనే పెంచిన లక్ష రూపాయలు చెల్లించాలని కోరారు. ధరలు పెరిగిన నేపథ్యంలో ప్రభుత్వం చెల్లిస్తున్న రూ.2.39లక్షలు ఏమాత్రం సరిపోవడం లేదని, యూనిట్ ధర రూ.10 లక్షలకు పెంచాలని విజ్ఞప్తి చేశారు. పిఎం జన్మన్ పథకంలో 12 రకాల అభివృద్ధి సౌకర్యాలు పివిటిజి గ్రామాల్లో అమలు చేయాలన్నారు. లేని పక్షంలో ఉద్యమం ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

మండల కమిటీ ఎన్నిక

ఈ సమావేశంలో ఎపి ఆదివాసీ గిరిజన సంఘం పెదబయలు మండల కమిటీ ఎన్నిక జరిగింది. సంఘం మండల అధ్యక్షునిగా బోండా గంగాధరం, కార్యదర్శిగా జంపరంగి సునీల్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు బోండా గంగాధరం మాట్లాడుతూ ఆదివాసీ హక్కులు చట్టాల పరిరక్షణ కోసం పోరాటం చేస్తామని, ఆదివాసీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రామారావు తదితరులు పాల్గొన్నారు.

38 ప్రాథమిక నర్సరీ కేంద్రాల గుర్తింపు / ఐటిడిఎ పిఒ తిరుమణి శ్రీపూజ

మాట్లాడుతున్న పిఒ శ్రీపూజ,

ప్రజాశక్తి-పాడేరు టౌన్: బెర్రీ బోర్ చీడపురుగు నిర్మూలనకు కష్టపడి పనిచేసినందుకు కాఫీ బోర్డ్ లైజెన్ వర్కర్లకు అభినందనలని ఐటిడిఎ పిఒ తిరుమణి శ్రీ పూజ అన్నారు. సోమవారం ఐటిడిఎ సమావేశ మందిరంలో కాఫీ బోర్డ్ లైజన్ వర్కర్లతో పరిచయ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ లక్ష ఎకరాల్లో కాఫీ తోటను, 75 వేల ఎకరాల పాత తోటల పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కాఫీ బోర్డు నుంచి కాఫీ విత్తనం సేకరణ, టెండర్స్ ద్వారా పాలిథిన్ సంచులు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. 38 ప్రైమరీ నర్సరీ కేంద్రాలు గుర్తించడం జరిగిందని పేర్కొన్నారు. 2026-27 నాటికి పదివేల ఎకరాల్లో కొత్త కాఫీ తోటల లక్ష్యంగా 15 వేల ఎకరాలలో పాత కాఫీ తోటలో పునరుద్ధరణకు తక్షణ చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు. లబ్ధిదారులను తొందరగా గుర్తించి నర్సరీలో తయారు చేసిన కాఫీ మొక్కలను పంపిణీ చర్యలు తీసుకోవాలని సూచించారు. చీడపురుగు నిర్మూలనకు ఎలాగైతే పని చేశారో అదేవిధంగా కొత్త ప్రాజెక్ట్ లక్ష్యాన్ని సాధించడంలో కృషి చెయ్యాలన్నారు. నవంబర్ ఫస్ట్ నుండి చేతికి వచ్చే కాఫీ పంట రైతుల నుండి చింతపల్లి మ్యాక్స్ సొసైటీ ద్వారా కాఫీ పండ్ల సేకరించుటకు లైసెన్ వర్కర్స్ సహాయాన్ని అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ (పిటిజి) ఎం.వెంకటేశ్వర్లు, కాఫీ బోర్డ్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎల్.బొంజయ్య, 11 మండలాల 150 మంది కాఫీ బోర్డు లైజన్ వర్కర్లు, 17 మంది ఫీల్డ్ కన్సల్టెన్సీలు, హార్టికల్చర్ కన్సల్టెంట్ లు, అగ్రికల్చర్ ఎక్స్టెన్షన్ ఆఫీసర్‌లు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభలను విజయవంతం చేయాలి

ముంచంగిపుట్టులో మాట్లాడుతున్న సర్పంచ్

ప్రజాశక్తి -అనంతగిరి: మండలం లోని అనంతగిరి పంచాయతీ పరిధి గ్రామాలలో నిర్వహించే గ్రామ సభలకు ప్రజలు పాల్గొని విజయవంతం చెయ్యాలని సచివాలయం సెక్రటరీ దేవా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో సోమవారం మాట్లాడుతూ, సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు గుర్తించేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రామస్థాయిలో సభలు నిర్వహిస్తుందన్నారు. రాజుపాక, తేనెపుట్టు గ్రామాలలో ఈనెల 7న మంగళవారం స్థానిక సర్పంచ్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందన్నారు.

ముంచింగిపుట్టు: మండలంలోని వనుగుమ్మ పంచాయతీ కేంద్రంలో సోమవారం స్థానిక ఎంపీటీసీ, మండల ప్రజా పరిషత్ ఉపాధ్యక్షురాలు, సర్పంచ్ సమక్షంలో విశ్వకర్మ యోగి గ్రామ సభను నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి కిరణ్ కుమార్, రంగబయలు పంచాయతీ కార్యదర్శి భగత్రం పాల్గొన్నారు. ఈ సమావేశంలో స్థానిక ఎంపీటీసీ భాగ్యవతి మాట్లాడుతూ, పంచాయతీల పరిధిలోని సమస్యలపై నివేదికలు సిద్ధం చేయాలని పంచాయతీ కార్యదర్శిలకు సూచించారు. గ్రామాలలో సిసి రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు తదితర సమస్యలు పరిష్కారమయ్యే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజినీర్ అసిస్టెంట్ సుధీర్, వెటర్నరీ అసిస్టెంట్ పరశు రాం వైసిపి నాయకులు జి దేవా, నీలకంఠం, రాజేంద్ర పాల్గొన్నారు

రెండు రోజులుగా అంధకారంలో చింతపల్లి

విద్యుత్ శాఖ నిర్లక్ష్యంపై ప్రజల ఆగ్రహం

ప్రజాశక్తి-చింతపల్లి : చింతపల్లి మండల కేంద్రంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రెండు రోజులుగా విద్యుత్ అంతరాయంతో చింతపల్లి ప్రజలు చీకటిలో మగ్గిపోయారు. ఇంటింటా చీకట్లు అలుముకున్నాయి. విద్యుత్ లేకపోవడంతో ఫ్యాన్లు తిరగక ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. చిన్న వ్యాపారులు, హోటల్ యజమానులు, వెల్డింగ్ షాపుల వారు నష్టాలను చవిచూస్తున్నారు. రోజుకి వచ్చే ఆదాయం కూడా ఆగిపోయిందంటూ వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులు చదువుకోలేక ఇబ్బంది పడుతున్నారు. మొబైల్ ఫోన్లు చార్జింగ్ లేక పనిచేయకపోవడంతో కమ్యూనికేషన్ సైతం నిలిచిపోయిన స్థితి ఏర్పడింది. రెండు రోజులుగా విద్యుత్ అంతరాయంపై ఫిర్యాదులు చేసినా అధికారులు కనీసం స్పందించడం లేదని స్థానికులు వాపోతున్నారు. కారణం ఏమిటో చెప్పే వారు కూడా లేరని మండిపడ్డారు. తీవ్ర వర్షాల కారణంగా ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయిందా? లేదా హైటెన్షన్ లైన్‌లో లోపమా అన్న అంశంపై అధికారుల నుంచి ఎటువంటి స్పష్టత రాలేదు. విద్యుత్ విభాగం అధికారులు మాత్రం మరమ్మతు పనులు జరుగుతున్నాయి, త్వరలోనే సరఫరా పునరుద్ధరిస్తామంటూ ఊరట మాటలు చెబుతున్నారు. ప్రజలు మాత్రం తక్షణమే కరెంట్ సరఫరా పునరుద్ధరించాలని, భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు రాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేస్తున్నారు.

502 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-పెదబయలు : మండలంలోని సీకరి పంచాయతీ పరిధి బొడ్డపుట్టు వద్ద ఆదివారం సాయంత్రం 502 కేజీల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... గంజాయి తరలిస్తున్న సమాచారం పెదబయలు పోలీస్ స్టేషన్ ఎస్ఐ కొల్లి రమణకు రావడంతో బొడ్డపుట్టు గ్రామం దగ్గరలోని మెయిన్ రోడ్డుపై పోలీసులు ఆదివారం సాయంత్రం వాహన తనిఖీ చేపట్టారు. ఈ సమయంలో సుజనకోట, అరడికోట జంక్షన్, కిముడుపల్లి మీదుగా జి.మాడుగుల వైపుగా గంజాయి లోడుతో వెళ్తున్న జీపును (ఏపీ 30వి 3251) తనిఖీ చేశారు. ఆ వాహనంలో సమారు 502 కేజీల గంజాయి పట్టుబడింది. దీంతో ఆ గంజాయిని, రెండు మొబైల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని, ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.25 లక్షలు ఉంటుందని, నిందితులపై ఎన్‌డిపిఎస్ కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు అనంతరం నిందితులకు జ్యూడిషియల్ రిమాండ్ విధించడంతో వారిని విశాఖపట్నం సెంట్రల్ జైలుకు తరలించినట్లు పేర్కొన్నారు.

హత్యకేసులో నిందితుడికి యావజ్జీవ శిక్ష

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలోని కాశీపట్నం పంచాయతీ గ్రామంలో ఎనిమిదేళ్ల క్రితం యువతిని హత్య చేసిన నిందితుడుకు యావజ్జీవ కారగార శిక్ష విధిస్తూ చోడవరం 9వ జిల్లా న్యాయస్థానం జడ్జి శిక్ష ఖరారు చేస్తూ సోమవారం ప్రకటించిందని అరకు సీఐ .హిమగిరి రావు తెలిపారు. సిఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. 2017 సంవత్సరంలో ఏప్రిల్ రెండవ తేదీ రాత్రి 8 గంటల సమయంలో కాశీపట్నం గ్రామనికి చెందిన కొర్ల లక్ష్మి పై కంఠ సూరిబాబు అనే నిందితుడు కత్తితో పొడవడంతో మృతి చెందిందన్నారు. కుటుంబ సభ్యుడు సిరిగం. రాజారావు ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టారన్నారు. మెజిస్ట్రేట్ కోర్టు యవజ్జీవ కారాగార శిక్ష విధించడమే కాకుండా పది వేల రూపాయలు జరిమానా విధించని తెలిపారు.

సచివాలయ ఉద్యోగుల యూనియన్ కార్యవర్గం

సచివాలయ ఉద్యోగుల నూతన కార్యవర్గం

ప్రజాశక్తి-చింతపల్లి : సచివాలయ ఉద్యోగుల యూనియన్ చింతపల్లి మండల అధ్యక్షునిగా వంపూరు శోభన్‌బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా లింగేటి మోహన్, కార్యదర్శిగా కిముడు నవ మోహన్ కుమార్, జాయింట్ సెక్రటరీగా సోనాయి లలిత, ట్రెజరర్‌గా గూడెపు మనోహర్, కో-ట్రెజరర్‌గా కినబరి పవన్ కుమార్ ఎన్నికయ్యారు. స్టీరింగ్ కమిటీలో బిసోయి భాను ప్రకాష్, కొడా రవీంద్రబాబు చోటుదక్కించుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా ఎన్నికైన శోభన్ బాబు మాట్లాడుతూ, సిబ్బంది సంక్షేమం, సమస్యల పరిష్కారం, సేవల సామర్థ్య పెంపు కోసం కృషి చేస్తానని తెలిపారు.

రామారావును పరామర్శిస్తున్న సర్పంచ్‌లు పలుసంఘాల పార్టీల నేతలు

లోతా రామారావుకు సర్పంచ్‌ల పరామర్శ

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: ఇటీవల అనారోగ్యానికి గురై విశ్రాంతి తీసుకుంటున్న ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావును సర్పంచుల సమైక్య అధ్యక్షులు కొంగర మురళీకృష్ణ, పలువురు సర్పంచులు, గిరిజన సంఘ నేతలు వైసిపి ఇతర నాయకులు సోమవారం ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. కొండపల్లి సర్పంచ్ కొంగర మురళీకృష్ణ, కుంజం జగన్నాథం, తదితరులు మాట్లాడుతూ. రామారావు త్వరగా కోలుకురని ప్రజా సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు సవిరల చంద్రుడు, వైసిపి నియోజకవర్గ వాణిజ్య విభాగ అధ్యక్షులు ఆద్యరమేష్ వైసిపి నాయకులు కుంత్రు అర్జున్, కొప్పిశెట్టి దుర్గబాబు, ఆవాల యేసు, చలుమూర్తి రమేష్, గిరిజన సంఘ నాయకులు తెడ్ల అబ్బాయి, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సర్పంచ్ ఈతపల్లి మల్లీశ్వరి

'చలో ఐటిడిఎ'కు కదలిరండి

ప్రజాశక్తి -మారేడుమిల్లి : 13న నిర్వహించే ఛలో ఐటిడిఎకు తరలి రావాలని వేటుకూరు సర్పంచ్ ఈతపల్లి మల్లేశ్వరి పిలుపునిచ్చారు. మారేడుమిల్లి మండలం వేటుకూరులో ఉపాధి పనులు గుర్తింపు గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి పనులు గుర్తించారు. అనంతరం మాట్లాడుతూ అక్టోబర్ 13న ఐటిడిఎ వద్ద శతశాతం ఏజెన్సీలో ఉద్యోగాలు ఆదివాసులకు ఇవ్వాలని దీనికి సంబంధించి చట్టం వెంటనే చేయాలని యువత ఆందోళన చేపట్టనున్న విషయాన్ని ఆమె గుర్తు చేశారు. అంతా ఈ ధర్నాలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. గ్రామపెద్దలు దూడ విజయభాస్కరరావు, జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

ఎఎస్‌డిఎస్ సంస్థ అధినేత గాంధీబాబుకు స్వచ్ఛాంధ్ర అవార్డు


అవార్డు తీసుకుంటున్న గాంధీబాబు

ప్రజాశక్తి-విఆర్‌పురం: రేఖపల్లి ప్రాంతానికి చెందిన వ్యవసాయ సాంఘిక అభివృద్ధి సంస్థ (ఎఎస్‌డిఎస్) రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే 'స్వచ్ఛ ఆంధ్ర 2025' అవార్డు సాధించింది. ఈ విషయాన్ని సంస్థ వ్యవస్థాపకులు వి.గాంధీబాబు తెలిపారు. ప్రభుత్వం అక్టోబర్ 6న స్వచ్ఛాంధ్ర అవార్డ్స్ కార్యక్రమాన్ని నిర్వహించింది. జిల్లాస్థాయిలో ఎఎస్‌డిఎస్ సంస్థకు అవార్డు లభించింది. గాంధీబాబు మాట్లాడుతూ ఇలాంటి అవార్డులు మరింత బాధ్యతను పెంచుతా యని హర్షం వ్యక్తం చేశారు. ఎఎస్‌డిఎస్ పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రత, గ్రామాభ్యుదయానికి ప్రాధాన్యం ఇస్తుందన్నారు.

బోధనాభ్యసన స్థాయి పెంపుతో మెరుగైన విద్య

జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్

హుకుంపేటలో మాట్లాడుతున్న డిప్యూటీ విద్యాశాఖాధికారి

పాడేరులో ప్రారంభిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-పాడేరు: బోధన అభ్యాసనా స్థాయి పెంపుతో మెరుగైన విద్య అందుతుందని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ అన్నారు. పాడేరు మండలంలో గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాల, శ్రీ కృష్ణాపురంలో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు ఏర్పాటు చేసిన శిక్షణ కేంద్రంను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జిల్లాలో అన్నీ పాఠశాలల్లో బోధనాభ్యసనా స్థాయిలు పెరగాలన్నారు. మొదటి విడత శిక్షణ ఈ నెల 8వ తేదీ వరకూ, రెండో విడత 9 నుండి 11 వరకు. నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో డిఇఒ బ్రహ్మాజీరావు, సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ అధికారి స్వామినాయుడు పాల్గొన్నారు.

హుకుంపేట: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన శిక్షణ తరగతులకు జిల్లా డిప్యూటీ విద్యాశాఖ అధికారి సోమెలి చెల్లయ్య, జిల్లా సాధారణ ఎన్నికల సమన్వయకర్త సెక్రటరీ కంబిడి సువర్ణరాజు ప్రారంభించారు. ఎంఇఒ ఈశ్వరరావు హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు : మండల కేంద్రంలోని స్కూల్ కాంప్లెక్స్ భవనంలో డిఇఒ బ్రహ్మజీ, ఎంఇఒ కృష్ణమూర్తి, బి.త్రినాధ్ తరగతులను ప్రారంభించారు. హాజరుకాని ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు పంపుతామన్నారు. పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు.

విఆర్‌పురం: జిల్లా కలెక్టర్ ఆదేశాలకు అనుగుణంగా విఆర్‌పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శిక్షణ ప్రారంభించారు. పాఠశాలలో పిల్లలకి మంచివిద్యను అందించాలని ఎంఇఒ లక్ష్మీనారాయణ, బాబూరావు తెలిపారు. సిఆర్‌టిలు నోడల్‌టీచర్స్ పాల్గొన్నారు.

చింతూరు: శిక్షణ కార్యక్రమాన్ని చింతూరు ఐటిడిఎ పిఒ శుభం నోక్వాల్ సందర్శించారు. శిక్షణ ఏ విధంగా ఉపయోగపడుతోందో ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. మొత్తం 120 మంది ఉపాధ్యాయులకు మొదటి విడత 6 నుండి 8వ తేదీ వరకు శిక్షణ ఇస్తారన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ 1,2 క్లస్టర్ ప్రధాన ఉపాధ్యాయులు, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

రంపచోడవరం : స్థానిక ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమంను పిఒ స్మరణ్‌రాజ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ తరగతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతిభ కనపరిచిన వారికి బహుమతులు కూడా ఇస్తామన్నారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య, ఏజెన్సీ డిఇఒ వై.మల్లేశ్వరరావు, సహాయక గిరిజన సంక్షేమ శాఖ అధికారులు కృష్ణమోహన్, రామ తులసి, సుజాత, మండల విద్యాశాఖ అధికారులు బాపన్నదొర తదితరులు పాల్గొన్నారు.


చింతూరు: ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ శుభంనొక్వాల్

విఆర్‌పురం: శిక్షణలో పాల్గొన్న సిఆర్‌టిలు, నోడల్‌టీచర్స్

అంతర్జాతీయ స్థాయిలో విశాఖకు కీర్తిప్రతిష్టలు

విశాఖ ఎంపి శ్రీభరత్

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ: ఇప్పటికే అంతర్జాతీయస్థాయిలో కీర్తిప్రతిష్ఠలు గడించిన విశాఖ మహానగరాన్ని మరింత అద్భుతంగా తీర్చిదిద్దేందుకు ప్రజల సహకారం అవసరమని విశాఖపట్టణం ఎంపి ఎం.శ్రీభరత్ పేర్కొన్నారు. సోమవారం విఎంఆర్డిఎ చిల్డ్రన్ ఎరీనాలో నిర్వహించిన స్వచ్ఛ అవార్డుల ప్రధానోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ నగర అభివృద్ధి, పరిశుభ్రతపై అవగాహన పెంపొందించాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు. పరిశుభ్రత విషయంలో ప్రజల్లో మార్పు రావాలని, విశాఖ విశిష్టతను పెంచేందుకు కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తోందని పేర్కొన్నారు. ఇటీవల చేపట్టిన 'ఆపరేషన్ లంగ్స్' ఒక సానుకూల మార్పుకు నాంది అన్నారు. ఈ చర్యపై నిర్వహించిన సర్వేలో 80 శాతం మంది ప్రజలు మంచి నిర్ణయంగా అభిప్రాయపడ్డారని చెప్పారు. ఫుట్‌పాత్‌లు ప్రజలు నడవడానికి మాత్రమేనని, అవి వ్యాపార ఆక్రమణలకు వేదిక కాకూడదని స్పష్టం చేశారు. ఇటీవలి దుకాణాల తొలగింపు వెనుక సింగపూర్ మాదిరిగా వెండింగ్ సముదాయాలు ఏర్పాటు చేయాలన్న ప్రణాళిక ఉందని స్పష్టం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిరప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా ప్రతి మూడో శనివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. 79 పంచాయతీల్లో మార్పు తీసుకురావడమే తమ ప్రధాన లక్ష్యమని, అందరి కషిని గుర్తించి అవార్డులు అందజేస్తున్నామని చెప్పారు. ప్రతి నియోజకవర్గంలో ఒక యూనిట్ ఏర్పాటు చేసి విజన్ ప్రణాళికను రూపొందించామని వివరించారు. టెర్రాస్ గార్డెనింగ్‌ను ఒక ఉద్యమంలా కొనసాగించాలని పిలుపునిచ్చారు. 45 జిల్లా స్థాయి అవార్డులు, 7 రాష్ట్ర స్థాయి అవార్డులు సాధించి విశాఖపట్నం జిల్లా రాష్ట్రంలో ద్వితీయ స్థానంలో నిలిచిందన్నారు. 79 పంచాయతీలను మోడల్ పంచాయతీలుగా తీర్చిదిద్దుతామని కలెక్టర్ పేర్కొన్నారు. పారిశుధ్య కార్మికులకు ధన్యవాదాలు తెలిపారు. దక్షిణ ఎమ్మెల్యే వంశీకష్ణ శ్రీనివాస్, ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్లు నాగలక్ష్మి, రాము, జివిఎంసి డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరాజు మాట్లాడారు. అనంతరం అవార్డు గ్రహీతలకు అవార్డులు, ప్రశంసాపత్రాలను అందజేశారు.

విశాఖ చేరుకున్న భారత మహిళా క్రికెట్ జట్టు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ: ఐసిసి ఉమెన్ వరల్డ్‌కప్ 2025లో వరుస విజయాలతో దూసుకుపోతున్న భారత మహిళా క్రికెట్ జట్టు తన మూడో మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాతో ఈ నెల 9వ తేదీన తలపడేందుకు సోమవారం మధ్యాహ్నం విశాఖపట్నం చేరుకుంది. ఆదివారం పాకిస్తాన్‌తో కొలంబో వేదికగా జరిగిన మ్యాచ్‌లో ఘనవిజయం సాధించిన విషయం తెలిసిందే. విశాఖలో నోవాటల్ హోటల్‌లో బస చేయనున్నారు. వీరు మంగళవారం మధురవాడలోని ఎసిఎ విడిసిఎ మైదానంలో ప్రాక్టీస్ ప్రారంభించనున్నారు. 9వ తేదీ గురువారం సౌత్ఆఫ్రికాతోను 12వ తేదీ ఆదివారం ఆస్ట్రేలియాతో జరగనున్న పోటీలో పాల్గొంటారు. అనంతరం ఇక్కడి నుండి తదుపరి మ్యాచ్‌ల్లో పాల్గొనేందుకు ఈ నెల 13వ తేదీన ఇండోర్ బయలుదేరి వెళతారు.

ఇస్త్రీ ప్రాజెక్ట్‌తో వీధి విక్రేతలకు చేయూత

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ: ది ఇస్త్రీ ప్రాజెక్ట్ ద్వారా, భారతదేశంలో ఉన్న ఇస్త్రీ విక్రేతలు రూ.100 కోట్ల ఆదాయాన్ని సంపాదించేలా ఉద్యమ్ వ్యాపార్ కార్యక్రమం చేపట్టామని ఉద్యమ్ లెర్నింగ్ ఫౌండేషన్ సహ వ్యవస్థాపకుడు కృష్ణన్ రంగనాథన్ తెలిపారు. సోమవారం విశాఖలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇస్త్రీ ప్రాజెక్ట్ ప్రోగ్రామ్ హెడ్ సిరిల్ జోసెఫ్ మాట్లాడుతూ ఈ ప్రాజెక్ట్ ద్వారా వీధుల్లో ఇస్త్రీ చేసే వారికి సబ్సిడీ ధరలకు బొగ్గు, ఎల్పీజీ ఆధారిత ఇస్త్రీ పెట్టెలను అందిస్తారన్నారు. దీనివల్ల, ఇస్త్రీ విక్రేతలు ఇంధన ఖర్చులను దాదాపు సగానికి తగ్గించుకోగలుగుతారన్నారు. బొగ్గు నుంచి ఎల్పిజికి మారడం వల్ల వారు ఎలాంటి కాలుష్యం బారిన పడరని అన్నారు.

జోస్‌అలూకాస్ సిగ్నేచర్ జ్యువెల్లరీ షో

ప్రజాశక్తి- ఎంవిపికాలనీ: నాణ్యత, ఆధునిక ఆభరణాల విషయంలో విశ్వసనీయత గల జోస్‌అలుక్కాస్, అక్టోబర్ 4 నుండి 26 వరకు విశాఖపట్నంలోని ప్రపంచస్థాయి వజ్రాల ప్రదర్శన 'సిగ్నేచర్ జ్యువెల్లరీ షో' ను ప్రదర్శిస్తోంది. ఈ షోలో నెక్లెస్లు, స్టాండ్-అవుట్ చెవిపోగులలో ప్రత్యేక కళాత్మక నమూనాలు ప్రదర్శనకు ఉంచుతున్నారు. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ జాన్ అలుక్కాస్ మాట్లాడుతూ సిగ్నేచర్ డైమండ్‌షోను విశాఖపట్నానికి తీసుకురావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ ప్రదర్శనలో వజ్రాలపై 20శాతం ప్రత్యేక తగ్గింపు అందిస్తున్నామని ప్రతి కొనుగోలుపై 500 మిల్లీగ్రాముల బంగారునాణెం లేదా క్యారెట్ ఉచిత ఆఫర్‌తో పాటు అదనంగా, పాత బంగారాన్ని అంతర్జాతీయ ప్రమాణాల ధ్రువీకరణ పొందిన వజ్రాలకు మార్పిడి చేసుకునే వెసులుబాటు కల్పిస్తున్నామన్నారు.

కెనరా బ్యాంకు అధికారుల యూనిటీ మార్చ్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ: ఐక్యతేమా బలం అనే నినాదంతో కెనరా బ్యాంకు అధికారుల సంఘం ఆధ్వర్యంలో విశాఖపట్నం బీచ్ రోడ్డులో సోమవారం యూనిటీ మార్చ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జనరల్ సెక్రటరీ రవికుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విశాఖపట్నం వేదికగా నవంబర్ 8,9,10వ తేదీల్లో జరగనున్న 20వ కెనరాబ్యాంకు ఆఫీసర్స్ అసోసియేషన్ త్రైవార్షిక సమావేశాలు ఘనంగా నిర్వహించేందుకు సిద్ధంగా ఉందనే సందేశాన్ని అందించడమే యూనిటీమార్చ్ ఉద్దేశం అని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ వైస్‌ప్రెసిడెంట్ రమాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం

ప్రజాశక్తి -ఎంవిపికాలనీ: కేంద్రపోర్టులు నౌక జలరవాణాశాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ విశాఖపట్నం పోర్ట్ అథారిటీలో పలు అభివృద్ధి కార్యక్రమాలను సోమవారం ప్రారంభించారు. అనంతరం సాగరమాల కన్వెన్షన్‌లో జరిగిన సభలో మాట్లాడుతూ ఈస్ట్ క్వే (ఇక్యు)-1ఏ టెర్మినల్ ఆపరేషన్ మెయింటెనెన్స్ ప్రాజెక్ట్‌ను విశాఖలోని గ్రీన్‌ఎనర్జీ రిసోర్సెస్‌కు రూ.130 కోట్ల వ్యయంతో అప్పగించామని ఈ ప్రాజెక్ట్‌లో 120 టన్నుల సామర్థ్యం గల రెండు హార్బర్ మొబైల్ క్రేన్లు అనుబంధ మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయనున్నారని తెలిపారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా సంవత్సరానికి 3 మిలియన్ మెట్రిక్ టన్నుల అదనపు సామర్థ్యం పెరుగుతుందన్నారు. 150 మందికి ఉపాధి అవకాశాలు కల్పించవచ్చాన్నారు. స్మార్ట్‌వీడియో సర్వైలెన్స్ ప్రాజెక్ట్‌ను రూ.37.53 కోట్లతో ప్రారంభించామని రైల్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, హైదరాబాద్ సంస్థ చేపట్టిందని, ఇందులో ఎఐ /ఎంఎల్ ఆధారిత వీడియో విశ్లేషణ సాంకేతికత, ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ఉంటాయని 12 నెలల్లో ఇది పూర్తికానుందన్నారు. డిజిటల్ హెల్త్‌కార్డ్‌సిస్టమ్ ప్రాజెక్ట్‌ను విశాఖ ట్రియున్‌ఫడర్ ప్రైవేట్ లిమిటెడ్ చేపట్టనుందన్నారు. విశాఖపట్నం లోక్‌సభ సభ్యుడు శ్రీభరత్, విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌యాదవ్, విశాఖ ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు, పోర్టు అధికారులు పాల్గొన్నారు.